అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


జడ్డంగి-చిన్నయ్యపాలెం రోడ్డు పనులను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి


తిమ్మాపురంలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రాజవొమ్మంగి: మన్యం అభివృద్ధి-పేద, బడుగు బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో తపనతో పనిచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని జడ్డంగి నుంచి లోతట్టు గ్రామం చిన్నయ్యపాలెంకు మంజూరైన బీటీ రోడ్డు, గృహ నిర్మాణ పనులకు ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చిన్నయ్యపాలెం గ్రామంలోని రామకోవెల వద్ద వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. చిన్నయ్యపాలెం వచ్చిన ఎమ్మెల్యే ధనలక్ష్మికి స్థానికులు పూలమాలలు వేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులకు ప్రభుత్వం గడచిన నాలున్నర సంవత్సరాల్లో అందజేసిన నవరత్నాల పథకాలను వివరించారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో రోడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు.జడ్డంగి నుంచి 6 కిలోమీటర్ల దూరంలోని చిన్నయ్యపాలెం చేరుకోడానికి రూ. 2.05 కోట్ల నిధులతో రోడ్డును ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ పనులను గిరిజన సంక్షేమశాఖ త్వరితగతిని పూర్తి చేస్తుందన్నారు. రూ. 2.39 లక్షల యూనిట్ కాస్టుగా జడ్డంగి పంచాయతీకు జన్‌మన్ పథకం క్రింద 34 శాశ్వత గృహాలు మంజూరు కాగా వాటిలో 23 ఇళ్లను ఒక్క చిన్నయ్యపాలెంకు కేటాయించడం విశేషమన్నారు. జగనన్న రాష్ట్రానికి చేసిన అభివృద్ధిని, లభించిన సంక్షేమాన్ని మరచిపోవద్దని, రానున్న రోజుల్లో కూడా పేదల పెన్నిధి మన జగనన్ననే సీఎంగా గెలిపించుకొందాం అని గిరిజనులను పిలుపునిచ్చారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, సవిరెల చంద్రుడు, ఆగూరి శుభలక్ష్మి, వైస్ ఎంపీపీ జుర్రా రాజేశ్వరి, ఎంపీటీసీలు కానెం అచ్చియమ్మ, ఆవుగడ్డ నిర్మలదేవి, గణలక్ష్మి, నాయకులు కామేష్, జాన్‌బాబు, దుర్గప్రసాద్, వీరబాబు, కుశరాజు, హౌసింగ్ డీఈ నరసింహరావు, ఏఈ వెంకట్రాజు, గిరిజన సంక్షేమశాఖ డీఈ గౌతమి, ఏఈ వీరభద్రరావు, సీఐ సన్యాసినాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం

అడ్డతీగల : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తీసుకొచ్చారని , గడప గడపలోనూ సంక్షేమాన్ని అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (బాబు) అన్నారు. మండలం తిమ్మాపురం గ్రామ సచివాలయం పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 220 గడపలను సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గడపకు తిరుగుతూ ఈ నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వ అందజేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులు బ్యాంకు ఖాతాలకు జమవుతుండడం చరిత్రాత్మకమన్నారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం గ్రామసచివాలయాన్ని ప్రారంభించారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జెడ్పీటీసీ సభ్యుడు మద్దాల వీర్రాజు, వైస్ ఎంపీపీ కరణం వీర వెంకట సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే శివారు ప్రాంతాల్లోనూ అభివృద్ధి


గిరిజనులతో మాట్లాడుతున్న అరకు అసెంబ్లీ సమన్వయకర్త రేగం మత్స్యలింగం

అనంతగిరి: ఏజెన్సీలో ప్రతి ప్రాంతం అభివృద్ధి జగనన్న పాలనలోనే జరిగిందని అరకు అసెంబ్లీ సమన్వయకర్త రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని జీనబాబు, పినకోట, పెదకోట, కివర్ల పంచాయతీల్లోని పలు గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మత్స్యలింగం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో శివారు గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, రోడ్లు, వంతెనలు, సీసీరోడ్లు, డ్రైనేజీ పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయని, దీనికి గిరిజనులే సాక్షమన్నారు. మునపెన్నడూ లేనంత అభివృద్ధి జరిగిందని, సమాచార వ్యవస్థ బలోపేతం దిశగా ప్రతి గ్రామానికి సెల్ టవర్ నిర్మాణం జరుగుతుందన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్న జగనన్నకు అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. సుపరిపాలన అందిస్తున్న జగనన్న ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలకు చెంప చెల్లుమనేలా ప్రజలంతా జవాబు ఇవ్వాలని పిలుపునిచ్చారు. వైస్ ఎంపీపీ బాడం శకుంతల, ఎంపీటీసీ సభ్యురాలు రామలక్ష్మి, శ్రావణి, సర్పంచ్‌లు గణేష్, అన్నపూర్ణ, ముత్యాలమ్మ, నాయకులు రాంబాబు, నాగేశ్వరరావు, దేముడమ్మ, లచ్చన్న, వెంకటరావు, కవిత తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలు తప్పనిసరి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట: మండలంలోని పెదగరువు ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలను ఎంపీపీ కూడా రాజుబాబు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు విద్యాభ్యాసం చేయించారు. పాఠశాలలో సమస్యలపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పాటించకపోవడం, నాణ్యమైన భోజనాన్ని అందించకపోవడంతో ఆయన పాఠశాల వార్డెన్, హెచ్ఎంలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో రోజూ అందిస్తున్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారానికి మూడు రోజులు గుడ్లు పెట్టవలసి ఉండగా, ఒక్కసారి మాత్రమే ఇస్తున్నారని, పెరుగు, పాలు, చక్కిలి, చికెన్ వారానికి ఒక్కసారి కూడా అందజేయడం లేదని, నాణ్యమైన భోజనం అందించటం లేదని విద్యార్థులు చెప్పడంతో ఎంపీపీ రాజుబాబు పాఠశాల ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ సక్రమంగా అమలుచేయాని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ సలహా మండల సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, సర్పంచ్ కాకరి బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థం


గంగవరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ , చిత్రంలో ఎస్ఐ రామకృష్ణ, సీడీపీవో లక్ష్మి, డాక్టర్ శ్వేత


చింతూరులో మాట్లాడుతున్న సీడీపీవో విజయగౌరి

గంగవరం: బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని తహసీల్దార్ శ్రీమన్నారాయణ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సీడీపీవో సీహెచ్.లక్ష్మి ఆధ్వర్యంలో మండల స్థాయి బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు అనర్థమని, ఈ విషయంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సీడీపీఓ లక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ శ్వేత మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహం జరిగితే దానిని వెంటనే సమాచారం అందించాలన్నారు. ఎంఈవో-2 మల్లేశ్వరరావు, మండలపరిషత్ పర్యవేక్షకుడు సిద్దేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో మండలస్థాయి చైల్డ్ మ్యారేజెస్ ప్రోహిబిషన్ ఆఫీసర్స్ కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరీ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపితే చట్టపరంగా కఠిన చర్యలు వుంటాయన్నారు. తహసీల్దార్ నజీముల్లాషా మాట్లాడుతూ ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేసి బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. ఎంఈవో-2 గుండి వెంకటేశ్వర్లు, డాక్టర్ ఉదయ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులతో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని పాతసుజనకోట గ్రామంలో గంగమ్మతల్లీ మహోత్సవాలను పురస్కరించుకొని గురువారం మండల స్థాయి క్రికెట్ పోటీలను మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంగడ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువత క్రీడల్లో రాణించాలన్నారు. మొదటి మ్యాచ్‌లో పాల్గొన్న ముంచంగిపుట్టు, బాబుశాల క్రికెట్ జట్లను సర్పంచ్ రమేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు శంకర్‌రావు, పలువురు నేతలు, నిర్వాహకులు పరిచయం చేసుకొని, ఉన్నత ఆటను ప్రదర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ గిరిజన యువతలో ఉన్న ప్రతిభను కనబర్చి ఉన్నతస్థాయిలో ఎదగాలన్నారు. ప్రభుత్వం క్రీడాల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రతిభ ఉంటే జాతీయస్థాయిలోకి గిరిజన క్రీడాకారులకు ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. వివిధ పార్టీలకు చెందిన నేతలు నీలకంఠం, బాబూరావు, నానిబాబు,దామోదరం, టోర్నీ నిర్వహకులు శ్యామ్, మనోజ్, సందీప్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గిరిజన విద్యార్థుల ప్రతిభ


ముంచంగిపుట్టు ఏకలవ్య కళాశాల విద్యార్థులు

పెదబయలు: ముంచంగిపుట్టు మండలం ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ప్రతిభ కనబరిచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.కేశవరావు తెలిపారు. జనవరిలో నిర్వహించిన పరీక్షలకు 13 మంది విద్యార్థులు హాజరు కాగా ముగ్గురు విద్యార్థులకు జేఈఈ మెయిన్స్‌కు అర్హత సాధించారని తెలిపారు. మండలం సీకరి గ్రామానికి చెందిన లకే శంకరరావు కుమార్తె లకే ఉమామహేశ్వరి 66.66 పర్సంటైల్, కిముడుపల్లి పంచాయతీ గడుగుపల్లి గ్రామానికి చెందిన కొర్ర బుట్టన్న కుమార్తె కొర్ర అఖిల సుప్రియ 57.72 పర్సంటైల్ అలాగే సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామానికి చెందిన జుంబు నూకరాజు కుమార్తె జుంబు సౌజన్య దివ్యాంగుల కోటలో అర్హత సాధించినట్టు చెప్పారు. మొదటి ప్రయత్నంలోనే ముగ్గురు అర్హత సాధించడం ఆనందంగా ఉందని ఏప్రెల్‌లో జరిగే పరీక్షలకు మరింతగా విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చి ఎక్కువ మంది అర్హత సాధించడానికి కృషి చేస్తామని తెలిపారు. కళాశాల అధ్యాపకులు, సమిష్టి కృషితోనే సాధ్యమవుతుందని సిబ్బందికి, విద్యార్థులకు ప్రిన్సిపాల్ పి.కేశవరావు అభినందనలు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఫణీంద్రరెడ్డి

వీఆర్ పురం: రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కారం లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం వీఆర్ పురం మండలం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. కల్లునూరు గ్రామంలో ఇవ్వాల్సిన రేషన్ బియ్యాన్ని గ్రామంలో పంపిణీ చేయకుండా జీడిగుప్ప గ్రామంలో పంపిణీ చేయడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారని శ్రీరామగిరి సర్పంచ్ పులిసంతోష్ చెప్పారు.అదే గ్రామంలో బియ్యం పంపిణీ అయ్యేలా రెవెన్యూ అధికారులు చూడాలని ఆయన కోరారు. మిడ్‌డే మిల్స్ కేంద్రాలకు బియ్యం సప్లై సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సరిపడిన బియ్యం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని చినమట్టపల్లి ఎంపీటీసీ పూనెం ప్రదీప్ అన్నారు.పలు సమస్యలపై వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడారు.జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి , తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎంపీడీవో ఆర్.ఫణీంద్రరెడ్డి , ఎంఈవో వి.వి.లక్ష్మీనారాయణ, ఏఓ రఘు, సర్పంచ్‌లు పిట్టా రామావు, పూనెం సరోజనీ, ఎంపీటీసీలు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ త్వరితగతిన పంపిణీ చేయాలి


రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ నజీముల్లాషా

చింతూరు: ప్రజా పంపిణీకి సంబంధించిన రేషన్ బియ్యాన్ని ప్రతినెలా 15వ తేదీలోగా తప్పనిసరిగా పంపిణీ చేయాలని చింతూరు తహసీల్దార్ నజీముల్లాషా ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గొడౌన్ నుంచి ప్రతి వస్తువు తీసుకున్న అనంతరమే థంబ్ వేయాలని ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. ఆర్ఐ దేవయ్య, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం


కల్వర్టు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్ పెంటమ్మ, స్వామి తదితరులు


మద్దిలవీధిలో రోడ్డుకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ కృష్ణవంశీ, వైస్ ఎంపీపీ ఆనంద్

అనంతగిరి: మండలంలోని మేడపర్తి-ఓనుకొండ రహదారిలోని చిట్టగెడ్డపై కల్వర్టు నిర్మాణ పనులకు గురువారం ఎంపీపీ శెట్టినీలవేణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిట్టగెడ్డపై కల్వర్టు నిర్మాణం కోసం స్థానికుల వినతితో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘ నిధులు నుంచి కల్వర్టు నిర్మాణానికి రూ.5 లక్షలను కేటాయించినట్లు తెలిపారు. గిరిజనులకు మేలు చేయడమే జగనన్న ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు శోభ జయశ్రీ, వైస్ సర్పంచ్ సర్వసతి, మాజీ ఎంపీటీసీ చంద్రరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భానుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలస పంచాయతీ మద్దిలవీధి వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ కృష్ణవంశీ గురువారం భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలోనే మారుమూల గిరిజన గ్రామాలన్నింటికీ పక్కారోడ్లతో పాటు మౌలిక సదుపాయాలు కల్పన జరిగిందన్నారు. వైస్ ఎంపీపీ ఆనంద్, వార్డు సభ్యులు సోములమ్మ, రాంబాబు, మండల కో-ఆర్డినేటర్ రమేష్, నాయకుడు శ్రీరాములు పాల్గొన్నారు.

అనారోగ్యంతో శిశువు మృతి


అనారోగ్యంతో మృతి చెందిన పాప

జి.మాడుగుల: మండలంలో నుర్మతి వాకపల్లి గ్రామంలో అయిదు నెలల శిశువు ఆరోగ్యపరమైన సమస్యలతో గురువారం మృతి చెందింది. వాకపల్లి గ్రామానికి చెందిన తల్లే లక్ష్మణరావు, సత్యవతి దంపతులకు చెందిన 5 నెలల వయస్సు గల పసి పాప మృతి చెందింది. ఈ విషయంపై డాక్టర్ శశికాంత్ వివరణ కోరగా బుధవారం రాత్రి పసి పాపకు తల్లి పాలు ఇచ్చి పాపను గంట సమయం వరకు భుజాన వేసుకోకపోవటం వలన పాలిచ్చి పడుకోపెట్టడంతో ఊపిరాడక మృతి చెంది ఉంటుందని చెప్పారు. ఈ సంఘటనపై విచారించగా బుధవారం వరకు పాప ఆరోగ్యం బాగానే ఉందని, ఆ రోజు రాత్రి పాపను పడుకోపెట్టిన తరువాత తల్లిదండ్రులు చూసేసరికి పాప కదిలికలు లేకపోవడంతో మృతి చెందినట్టు గ్రామస్తులు చెప్పారన్నారు. చిన్నారులకు పాలు ఇచ్చే విధానంపై బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

సర్వేయరు కోర్సులో శిక్షణకు దరఖాస్తులు

మాకవరపాలెం: సర్వేయరు కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ గురువారం తెలిపారు. మాకవరపాలెంలో ఉన్న నాక్ శిక్షణ కేంద్రంలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్ పూర్తి చేసి, 15 నుంచి 45 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. శిక్షణకు అవసరమైన మెటీరియల్ ఉచితంగా అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 7780374625 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

23 నుంచి ఐద్వా జాతీయ సమావేశాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయ తదితరులు

అరకులోయ రూరల్: విశాఖ కేంద్రంగా ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న ఐద్వా జాతీయ సమావేశాలు విజయవంతం చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.వి.జయ చెప్పారు. స్థానిక గిరిజన్ భవన్‌లో గురువారం అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ ఐద్వా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహిళల అభ్యున్నతి కోసం తమ సంఘం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఐద్వా మహాసమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అరకులోయలో ఈనెల 27న జరగనున్న జాతీయ సెమినార్‌కు వివిధ రాష్ట్రాల నుంచి నాయకులు హాజరుకానున్నట్టు చెప్పారు. కొసల్య, హైమావతి, భాగ్యవతి, శశికళ, దేవుడమ్మ, కాసులమ్మ, కుమారి, కుసుమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘టీడీపీ కోసం కష్టపడినా.. పట్టించుకోలేదు’

- టీడీపీ రెబల్ అభ్యర్థి సివేరి అబ్రహం


మాట్లాడుతున్న టీడీపీ రెబల్ అభ్యర్థి అబ్రహం

ముంచంగిపుట్టు: టీడీపీ కోసం అహర్నిశలు కష్టపడ్డానని.. టీడీపీ అధినేత చంద్రబాబు నన్ను పట్టించుకోలేదని టీడీపీ రెబల్ అభ్యర్థి సివేరి అబ్రహం ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని దొడిపుట్టు, జోలాపుట్టు, బాబుశాల పంచాయతీల్లో పలు గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. టీడీపీ వల్ల తనకు జరిగిన అన్యాయం కోసం ప్రజలకు వివరించి, తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ 2024లో నాకు అరకు టీడీపీ టికెట్ ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి, నన్ను పార్టీ కార్యక్రమాల్లో వినియోగించుకొని, పార్టీ జెండా మోసిన నాకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. తన తండ్రి పార్టీ కోసం ప్రాణత్యాగం చేసినా, చంద్రబాబు నన్ను పక్కన పెట్టడం తీవ్రంగా బాధించిందని, నాకు జరిగినట్టు పార్టీలో మరెవరికి జరగకూడదన్నారు.

19న కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

అచ్యుతాపురం : హరిపాలెం హరిగిరి కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఈ నెల 19న చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు 16 నుంచి హోమాలు, ఊరేగింపులు జరపనున్నట్టు వారు పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ రోజున భారీ అన్న సమారాధన కార్యక్రమం చేపట్టనున్నట్టు వారు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

కొయ్యూరు : ప్రకృతి వ్యవసాయం సాగు ద్వారా భావి తరాలకు ఆరోగ్యాన్ని అందివ్వాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సిహెచ్.లచ్చన్న అన్నారు. మండలంలోని విసన్నపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగుపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతులు పాటించి పంటలను సాగు చేయాలన్నారు. తద్వారా ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి దోహదపడాలన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంటల సాగుకు ఐదు అంచెల పద్ధతి అనుసరించాలన్నారు. పంటల అధిక దిగుబడులు పొందడానికి, తెగుళ్ల నివారణకు ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన కాషాయాలు వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా కూరగాయల సాగు, మిశ్రమ పంటల సాగు వల్ల ఉపయోగాలు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ట్యాంకు గురించి, ఔషధ మొక్కల పెంపకం, కలుపు నివారణ పద్ధతులు, విత్తన శుద్ధి తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ సిబ్బంది చిన్న, యూనిట్ ఇన్‌ఛార్జి కూంద్రపు అరుణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

20న మండల సమావేశం

గూడెంకొత్తవీధి: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 20 నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

రేపు కంటి వైద్య శిబిరం

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో గిరిజన ఉద్యోగ భవనంలో శనివారం అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యు.వి.గిరి ఒక ప్రకటనలో గురువారం తెలిపారు.ఈ శిబిరానికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి , విశాఖ నుంచి వైద్య నిపుణులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ కార్డు ఉన్న అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అర్హులన్నారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

కొయ్యూరు: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో అయిదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.వి.మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి విద్యార్థి 2023-24లో నాలుగవ తరగతి చదివి ఉండాలన్నారు. బీసీ, ఓసీ విద్యార్థులు సెప్టెంబర్ ఒకటి 2013 నుంచి ఆగస్టు 31, 2015 మధ్య జన్మించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సెప్టెంబర్ ఒకటి 2011 నుంచి ఆగస్టు 31, 2015 మధ్య జన్మించి ఉండాలని, దరఖాస్తులను ఆన్‌లైన్‌లో www.aptwgurukulam.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరచాలని సూచించారు.

సర్పంచ్ చొరవతో ఇంటింటికీ రేషన్


రేషన్ అందజేస్తున్న సర్పంచ్ అరుణకుమారి

చింతూరు: చిడుమూరు సర్పంచ్ కాక అరుణ కుమారి చొరవతో జువ్విగూడెం, బుర్కనకోట గ్రామాల్లో గురువారం వాహనం ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేశారు. రెండు గ్రామాలకు వాహనం ద్వారా రేషన్ సరఫరా కాలేన్నట్టు సమాచారం తెలుసుకుని వాహనం ఏర్పాటు చేసి రేషన్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ అరుణకుమారి చెప్పారు. జువ్విగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, చిన్నారులకు పాలు, గుడ్లను సర్పంచ్ పంపిణీ చేశారు. సచివాలయ కన్వీనర్ సీతారామయ్య, వలంటీర్లు గంగరాజు, సుబ్బు పాల్గొన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి


కార్యక్రమానికి వచ్చిన భక్తులు

కొయ్యూరు: హైందవ ధర్మ పరిరక్షణ కోసం అంతా పాటుపడాలని విశ్వహిందు పరిషత్ కేంద్ర సహకార్యదర్శి గుమ్మళ్ల సత్యం జీ అన్నారు. రాజేంద్రపాలెంలో గురువారం నిర్వహించిన అయోధ్య రామ సేవకుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. హైందవ ధర్మ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ధర్మ ప్రచారకుడు సూర్యనారాయణ మాట్లాడుతూ అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఎంపీపీ రమేష్, వైస్ ఎంపీపీ నూకాలమ్మ, సర్పంచ్ సింహచలం, మల్లిబాబు, లింగమూర్తి, నగేష్, వీర్రాజు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

ముంచంగిపుట్టు: రవాణా రంగం రక్షణ కోసం శుక్రవారం చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి శంకర్‌రావు కోరారు.మండల కేంద్రంలో గురువారం మోటార్ యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు.నూతన రవాణా చట్టాన్ని రద్దు చేయాలని ఆందోళన చేశారు. కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత బిల్లు చట్టం వల్ల ఆటో,జీపు,లారీలు కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని, వెంటనే చట్టాన్ని రద్దు చేయాలన్నారు. శ్రీను,డొంబ్రు,కృష్ణ,లైకోన్‌లు పాల్గొన్నారు.